


# నిదానించి

**మూలవాక్యము:**

**విలాప 1:12** త్రోవను నడుచువారలారా, ఈలాగు జరుగుట చూడగా మీకు చింతలేదా?యెహోవా తన ప్రచండకోప దినమున నాకు కలుగజేసిన శ్రమ వంటి శ్రమ మరి ఎవరికైనను కలిగినదో లేదో మీరు నిదానించి చూడుడి.

ఈ ప్రవచనము యేసయ్య సిలువ శ్రమలను గూర్చినదని మనకు అర్థమౌతుంది. యేసయ్య సిలువ శ్రమలను, మరణాన్ని నిదానించి చూచినప్పుడు ఆయన పొందిన శ్రమ వంటి శ్రమ ఈ లోకంలో వేరెవ్వరు అనుభవించలేదని అర్థమౌతుంది.

నిదానించి చూడడము అన్న మాటకు జాగ్రత్తగా చూడడం,పరిశీలించి చూడడం,తొందరపడకుండా, ఆతురము లేకుండా,మోసపోకుండా,మభ్యపెట్టపడకుండా....ఇలా చాలా అర్థాలు ఉన్నట్లు గమనించగలము

నిదానించి చూడడము దైవ లక్షణాలలో ఒక లక్షణముగా ఉన్నది. ఇశ్రాయేలీయులు ఐగుప్తు దేశములో బ్రదుకుతున్న బానిస బ్రదుకును, వారి మూలుగులను దేవుడు నిదానించి చూచినట్లుగా వాక్యములో వ్రాయబడి ఉంది.

**అ.కా 7:34** ఐగుప్తులో నున్న నా ప్రజల దురవస్థను నేను నిదానించి చూచితిని; వారి మూలుగు వింటిని; వారిని విడిపించుటకు దిగి వచ్చి యున్నాను; రమ్ము, నేనిప్పుడు నిన్ను ఐగుప్తునకు పంపుదునని అతనితో చెప్పెను.

దేవుని పిల్లలమైన మనము కూడా నిదానించి చూచే లక్షణాన్ని కలిగి యుండాలని వాక్యము బోదిస్తున్నది. నిదానించి చూస్తే ఏమి జరుగుతుందో వాక్యములో గమనిద్దాం.

**1. నిదానించి చూచినప్పుడు ఒక వేశ్య చనిపోయిన బిడ్డ తన బిడ్డ కాదని గ్రహించగలిగింది: 1రాజు 3:21**
ఉదయమున నేను లేచి నా పిల్లకు పాలియ్య చూడగా అది చచ్చిన దాయెను; తరువాత ఉదయమున నేను పిల్లను నిదానించి చూచినప్పుడు వాడు నా కడుపున పుట్టినవాడు కాదని నేను తెలిసికొంటిని.

మనము కనిన మన ఆత్మీయ పిల్లలు వారి ఆత్మీయ జీవితంలో సజీవులుగా ఉన్నారా లేక జీవించు చున్నామన్న పేరు మాత్రమే కలిగి యుండి చనిపోయిన స్థితిలో ఉన్నారా అన్నది మనము తెలుసుకోవాలంటే వారి ఆత్మీయ జీవితాన్ని నిదానించి చూడవలసియున్నది.

**2. కావలి వాడు నిదానించి చూడడము ద్వారా తన దేశము మీదికి తన పట్టణము మీదికి రాబోతున్న ఉపద్రవాన్ని కనుగొనగలడు : యెష 21:7** జతజతలుగా వచ్చు రౌతులను వరుసలుగా వచ్చు గాడిదలను వరుసలుగా వచ్చు ఒంటెలును అతనికి కనబడగా అతడు బహు జాగ్రత్తగా చెవి యొగ్గి నిదానించి చూచున.

ప్రియ సహోదరుడా నీవు నీ కుటుంబానికి కావలివాడవు. ప్రియ సేవకుడా నీవు నీ సంఘమునకు కావలివాడవని జ్ఞాపకము చేస్తున్నాను. నీ కుటుంబమునకు నీ సంఘమును పాడు చేయడానికి, నాశనము చేయడానికి శత్రువైన సాతాను పన్నుతున్న కుట్రలు నీవు గ్రహించాలంటే ప్రార్థనలో నిదానించి కనిపెట్టాలి. మెలకువగా ఉండి నీ కుటుంబమును, నీ సంఘమును జాగ్రత్తగా కాపాడుకోవాలని జ్ఞాపకము చేస్తున్నాను.

**3. ప్రవక్తకు నిదానించి చూచే అనుభవము దేవుడు నేర్పిస్తున్నాడు: జెక 5:5** అప్పుడు నాతో మాటలాడుచున్న దూత బయలు వెళ్లి నీవు నిదానించి చూచి ఇవతలకు వచ్చునదేమిటో కనిపెట్టుమని నాతో చెప్పగా...

**1. దైవజనుడైన మోషేకు మాత్రమే ఇవ్వబడిన గొప్ప ఆధిక్యత:**

**దేవుని స్వరూపమును నిదానించి చూడడము:- అ.కా 7:31,32** మోషే చూచి ఆ దర్శనమునకు ఆశ్చర్యపడి దాని నిదానించి చూచుటకు దగ్గరకు రాగా నేను నీ పితరుల దేవుడను, అబ్రాహాము, ఇస్సాకు, యాకోబుల దేవుడను అని ప్రభువు వాక్కు వినబడెను గనుక మోషే వణకి, నిదానించి చూచుటకు తెగింపలేదు.

**సంఖ్యా 12:8** నేను గూఢ భావములతో కాదు, దర్శనమిచ్చి ముఖాముఖిగా అతనితో మాటలాడుదును; అతడు యెహోవా స్వరూపమును నిదానించి చూచును. కాబట్టి నా సేవకుడైన మోషేకు విరోధముగా మాటలాడుటకు మీరేల భయపడలేదనెను.

**2. దావీదు నా కుడిప్రక్కను నిదానించి చూడుమని దేవునిని కోరుతున్నాడు:-**

**కీర్త 142:4** నా కుడిప్రక్కను నిదానించి చూడుము నన్నెరిగినవాడు ఒకడును నాకు లేకపోయెను. ఆశ్రయమేదియు నాకు దొరకలేదు. నా యెడల జాలిపడు వాడు ఒకడును లేదు.

**మనం ఇంకా వేటిని నిదానించి చూడవలెనో వాక్యములో చూద్దాం:-**

**1. ఆది నుండి ఉన్న జీవ వాక్యమును నిదానించి కనుగొనాలి:-**

**1యోహా 1:1** జీవ వాక్యమును గూర్చినది, ఆది నుండి ఏది యుండెనో, మేమేది వింటిమో, కన్నులారా ఏది చూచితిమో, ఏది నిదానించి కనుగొంటిమో, మా చేతులు దేనిని తాకి చూచెనో, అది మీకు తెలియజేయుచున్నాము.

**2. మనము బ్రదుకునట్లు సిలువలో ఎత్తబడిన యేసయ్యను నిదానించి చూడాలి:- యోహా 3:14,15**

అరణ్యములో మోషే సర్పమును ఏలాగు ఎత్తెనో ఆలాగే విశ్వసించు ప్రతివాడును నశింపక ఆయన ద్వారా నిత్యజీవము పొందునట్లు మనుష్యకుమారుడు ఎత్తబడవలెను.

**సంఖ్యా 21:9** కాబట్టి మోషే ఇత్తడి సర్పమొకటి చేయించి స్తంభము మీద దానిని పెట్టెను. అప్పుడు సర్పపు కాటు తినిన ప్రతివాడు ఆ యిత్తడి సర్పమును నిదానించి చూచినందున బ్రదికెను.

**3. యేసయ్యను నిజంగా వెంబడిస్తున్న వారిని నిదానించి కనుగొనాలి:-**

**మార్కు 14:67** పేతురు చలి కాచుకొనుచుండగా చూచెను;అతనిని నిదానించి చూచి నీవును నజరేయుడగు ఆ యేసుతో కూడ ఉండినవాడవు కావా? అనెను.

**4. ఆకాశము వైపు నిదానించి చూడాలి:-**

**యోబు 35:5** ఆకాశము వైపు నిదానించి చూడుము. నీ కన్న ఉన్నతమైన ఆకాశ విశాలముల వైపు చూడుము.

**కీర్త 19:1** ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి. అంతరిక్షము ఆయన చేతి పనిని ప్రచురపరచుచున్నది.

**5. సీయోను (పరలోక పట్టణ ప్రాకారములు) ప్రాకారములు నిదానించి చూడాలి:-**

**కీర్త 48:12,13** ముందు రాబోవు తరములకు దాని వివరము మీరు చెప్పునట్లు సీయోను చుట్టు తిరుగుచు దాని చుట్టు సంచరించుడి.

**6. అదృశ్యమైన వాటిని నిదానించి చూడాలి:-**

**2 కొరింథీ 4:17** మేము దృశ్యమైన వాటిని చూడక అదృశ్యమైన వాటినే నిదానించి చూచుచున్నాము. గనుక క్షణమాత్రముండు మా చులకని శ్రమ మా కొరకు అంతకంతకు ఎక్కువగా నిత్యమైన మహిమ భారమును కలుగజేయుచున్నది.

**7. మాటలాడుటకు నిదానించు వారముగా ఉండాలి:-**

**యాకో 1:19** నా ప్రియ సహోదరులారా, మీరీ సంగతి ఎరుగుదురు గనుక ప్రతి మనుష్యుడు వినుటకు వేగిరపడువాడును, మాటలాడుటకు నిదానించు వాడును, కోపించుటకు నిదానించువాడునై యుండవలెను.

**ముగింపు:-**

నిదానమే ప్రధానమని పెద్దల సూక్తి. అలాగే త్వరపడాల్సిన విషయాల్లో నిదానించటం, ఆలస్యం చేయటం, ఆలస్యం అమృతం విషమని పెద్దలు అన్నారు.

పరిశుద్ధ బైబిల్ గ్రంథంలో దేనికి త్వరపడాలనో దేనికి నిదానించాలనో మనకు స్పష్టంగా నేర్పించి సమయ సందర్భాలను బట్టి విషయా ప్రాధాన్యతలను బట్టి జాగరూకతతో దేవుని కార్యాలు జరిగిద్దాం. దేవుని నామానికి మహిమ కలుగచేద్దాం.